నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 24 ఏప్రిల్ 2024 | KHAMMAM

# అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌దే..

## మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

## దమ్మపేట బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు. పక్కన మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా, తాటి

దమ్మపేట, ఏప్రిల్ 23 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. దమ్మపేటలోని మామిడి తోటలో మంగళవారం ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి శాసనసభ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. డిసెంబర్ 9న ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు, అత్తకు రూ.4 వేలు, కోడలికి రూ.2,500 పెన్షన్, రూ.2 లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ఆటో కార్మికులకు రూ.12 వేలు, విద్యార్థినులకు స్కూటీ ఇస్తామని చెప్పి మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని విమర్శించారు. తాను తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యే నాటికి ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారులే లేవన్నారు. దీంతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో తెలంగాణలో 3 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను తీసుకొచ్చానన్నారు. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతోందని, ఈ విషయాన్ని పార్లమెంటులో మోదీ ప్రభుత్వమే అంగీకరించిందన్నారు. అభివృద్ధిపై కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం భద్రాచలం నుంచి కొవ్వూరు రైల్వే లైన్‌కు సింగరేణితో రాష్ట్ర వాటా నిధులు ఇప్పించి సత్తుపల్లి వరకు రైల్వే లైన్ పూర్తి చేయడమేనని అన్నారు. ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లు సైతం నడిపించడానికి కృషి చేస్తానన్నారు.

### మట్టి, ఇసుక దందాలో బిజీబిజీ : మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

కాంగ్రెస్ నాయకులు మట్టి, ఇసుక దందాతో దోచుకునే పనిలో బిజీగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దుయ్యబట్టారు. యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనే దిక్కు కాంగ్రెస్ పాలనలో కరువైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడుదారులతోపాటు రైతులందరికి రైతుబంధు జమ చేయలేదన్నారు.

### దగా చేయడమే కాంగ్రెస్ పని : మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

ప్రజలను దగా చేయడం కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే ఉన్నదని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. రైతుల పక్షపాతిగా కేసీఆర్ రైతుల గుండెల్లో ఉన్నారన్నారు. దమ్మపేట మండలంలోని అప్పారావుపేటలో కేసీఆర్ హయాంలో రూ.వంద కోట్ల వ్యయంతో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీ రైతుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. సమావేశంలో ములకలపల్లి జడ్పీటీసీ సున్నం నాగమణి, వగ్గెల పూజ, దమ్మపేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, దొడ్డా రమేశ్, దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు, పర్వతనేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రామయ్య సేవలో ఎంపీ అభ్యర్థి నామా



రామయ్యను దర్శించుకున్న నామా నాగేశ్వరరావు

భద్రాచలం, ఏప్రిల్ 23 : బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు భద్రాచలం సీతారామచంద్ర స్వామిని మంగళవారం దర్శించుకున్నారు. బుధవారం నామినేషన్ వేయనున్న నేపథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద పూజలు చేసిన ఆయన ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంచి మెజార్టీతో విజయం సాధించి ప్రజలకు సేవలందించాలని అర్చకులు ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, తాళ్లూరి జీవన్, మోరంపూడి ప్రసాద్, బీఆర్‌ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, మండల పార్టీ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, నామా యూత్ నాయకుడు దుద్దుకూరి రాజా, కోలా రాజు, ఎస్కే అజీమ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమ్మ సంఘం ఆధ్వర్యంలో నామాను శాలువాతో ఘనంగా సత్కరించి, సీతారామచంద్రస్వామివారి జ్ఞాపికను అందజేశారు.

# స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు చర్యలు

## – కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, ఏప్రిల్ 23 : స్వేచ్ఛ, న్యాయబద్ధంగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు చేపడుతున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మంగళవారం ఎన్నికల సమన్వయం కోసం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, ఎస్పీలతో జూమ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టర్ వి. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్‌పోస్టుల ద్వారా 24గంటలు క్రియాశీలకంగా నిఘా ఉంచాలన్నారు. సమాచారం పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో 12 మిర్రర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. పీఆర్, ఆర్‌అండ్‌బీ రహదారులు 60 ఉన్నట్లు, చెక్‌పోస్టులు లేనిచోట స్థానిక పోలీస్, ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా బృందాలు తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఓటు వేసేప్పుడు ఇండిబుల్ ఇంక్ వెంటనే తుడుచుకోనీయకుండా పోలింగ్ కేంద్రంలో చర్యలు తీసుకుంటే తిరిగి ఓటు వేసేందుకు ఆస్కారం ఉండదన్నారు. ఓటర్‌స్లిప్పుల పంపిణీ ఈ నెల 25వ తేదీ నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, సీపీవో ఏ. శ్రీనివాస్, ఆర్డీవో ఆఫ్రీన్, కలెక్టరేట్ ఏవో అరుణ, జీఎస్టీ, ఐటీ అధికారులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ



కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తరఫున నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఆ పార్టీ నాయకులు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 23 : ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డికి చెందిన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆ పార్టీ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, నిరంజన్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, నూకల నరేశ్‌రెడ్డి, రామ్మూర్తినాయక్, ఎండి.ముస్తఫా, మాలీదు జగన్, జొన్నగడ్డ రవి, రమేష్ దాఖలు చేశారు. సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా రైస్ అన్వర్, స్వతంత్ర అభ్యర్థిగా కట్టకొజ్వల నాగేశ్వరరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ఏవీజే.ప్రసాద్, స్వతంత్ర అభ్యర్థిగా అవుటపల్లి రామలింగేశ్వరరావు ఒక సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్ రావుకు చెందిన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆ పార్టీ నాయకులు సుగ్గుల వెంకటేశ్వరరావు గుప్తా, గంటేల విద్యాసాగర్‌లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కాశిమల్ల నాగేశ్వరరావు ఒక సెట్, షేక్ సిరాజొద్దీన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ స్వీకరించారు. కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో ఇంకా ఆ పార్టీ అధిష్టానం స్పష్టత ఇవ్వలేదు. దీంతో రఘురాంరెడ్డి తరఫున ఆ పార్టీ నాయకులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడం జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# బీఆర్‌ఎస్‌లో సొసైటీ డైరెక్టర్ల చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ మాలోత్ కవిత

టేకులపల్లి, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని బేతంపూడి సొసైటీకి చెందిన ముగ్గురు కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మర వరప్రసాద్, బొడ బాలు ఆధ్వర్యంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్కినేని శ్యామ్‌బాబు, ఎండీ మౌలానా, డర్మావత్ శివ, కుమ్మరి కిరణ్, జరుపుల శివ పాల్గొన్నారు.

# మోసాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

- కేసీఆర్ పాలనలోనే అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి
- మహబూబాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత
- పెట్టుబడి సాయం ఘనత కేసీఆర్‌దే.. : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు
- కేసీఆర్ పాలనలోనే గిరిజనుల అభివృద్ధి : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- ప్రతి పేదవాడికి న్యాయం : ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు
- మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి నామినేషన్ అనంతరం మాట్లాడిన పలువురు నేతలు



నామినేషన్ దాఖలు చేస్తున్న మహబూబాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : మోసాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మహబూబాబాద్ ఎంపీ, బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. మంగళవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పార్లమెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మహబూబాబాద్‌లో ఆమె నామినేషన్ వేశారు. అనంతరం ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ప్రతి నిరుపేదకు న్యాయం జరిగిందన్నారు. నమ్మదగని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మానుకోట సభ పెట్టినప్పుడే ప్రజలు రాలేదని, అప్పుడే కాంగ్రెస్ పార్టీకి తమ పరిస్థితి ఏమిటనేది అర్థమైపోయిందన్నారు. కాంగ్రెస్ నాయకులు తండాలు, గూడేలలో తిరుగుతుంటే ప్రజలు వెంటపడి తిడుతున్నారన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం ఇప్పుడు మాట మార్చి ఆగస్టు 15న రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఒక్క పథకం కూడా ప్రజలకు మేలు చేయడం లేదన్నారు. బీజేపీ పార్టీ వివిధ మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు.

### నామినేషన్ వేసిన మానుకోట బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత

మహబూబాబాద్, ఏప్రిల్ 23 : మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత నామినేషన్ వేశారు. మంగళవారం పార్లమెంట్ పరిధిలోని మహబూబాబాద్, ఇల్లెందు, ములుగు, నర్సంపేట, పినపాక ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన శంకర్‌నాయక్, బానోతు హరిప్రియ, బడే నాగజ్యోతి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రేగా కాంతారావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతి రాథోడ్‌లతో కలిసి కవిత ఎంపీ అభ్యర్థిగా నామినేషన్‌ను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్‌కు అందజేశారు. ప్రస్తుతం మానుకోట సిట్టింగ్ ఎంపీగా కవిత ఉన్నారు. అలాగే ఇదే నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా బానోత్ భావ్‌సింగ్, పోరిక శ్యామలనాయక్, ఆదార్ పార్టీ అభ్యర్థిగా జాటోత్ రవివర్మ మరోమారు నామినేషన్ దాఖలు చేశారు. ఆదివాసీ జేఏసీ ఎంపీ అభ్యర్థిగా చందా లింగయ్య సైతం నామినేషన్ దాఖలు చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తరఫున మోకాళ్ల మురళీకృష్ణ కూడా నామినేషన్ వేశారు.

### పెట్టుబడి సాయం ఘనత కేసీఆర్‌దే.. : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



గత కేసీఆర్ ప్రభుత్వం రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందజేసిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు రైతులకు రైతుబంధు జమ చేయలేదన్నారు. యాసంగి పంటలు ఎండిపోయి అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రైతులను ఆదుకోవాలన్నారు. కేసీఆర్ నేతృత్వంలో ప్రతి తండా, గూడేనికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించారని, కాంగ్రెస్ పార్టీ వచ్చి నీటి తండ్లాట పెట్టిందన్నారు. కేంద్రంలో పదేళ్ల నుంచి ప్రధానిగా ఉన్న మోదీ నిరుపేదలకు ఏ లాభం చేయ లేదని, కార్మికులు, కర్షకులను అనేక ఇబ్బందులు పెట్టారన్నారు.

### కేసీఆర్ పాలనలోనే గిరిజనుల అభివృద్ధి : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



గత కేసీఆర్ ప్రభుత్వంలోనే గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తండాలను ప్రత్యేక జీపీలుగా చేయడంతో ఎంతో మందికి సర్పంచ్‌లు అయ్యే అవకాశం వచ్చిందన్నారు. మానుకోట ప్రాంత గిరిజన విద్యార్థుల కోసం మెడికల్ కళాశాల, హార్టికల్చర్, నర్సింగ్, ఇంజినీరింగ్ కళాశాలను గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ తండాకు వెళ్లి చూసినా ఇబ్బందులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందరికి న్యాయం చేస్తుందన్నారు.

### ప్రతి పేదవాడికి న్యాయం : ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



గత కేసీఆర్ పాలనలో ప్రతి పేదవాడికి న్యాయం జరిగిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మండు వేసవిలో సైతం ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చెరువులను నింపిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. ప్రతి ఎకరాకు నీరందించి రెండు పంటలు పండించారని, అన్ని పంటలకు కనీస మద్దతు ధరను గత కేసీఆర్ ప్రభుత్వం అందించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ తగ్గిందని, మానుకోటలో బహిరంగ సభ పెడితే అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. నిరుపేదలు బీఆర్‌ఎస్ పార్టీ వైపే ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్, ములుగు జడ్పీ చైర్ పర్సన్‌లు అంగోతు బిందు, బడే నాగజ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్.రెడ్యానాయక్, బానోతు శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బానోతు హరిప్రియానాయక్, రేగా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన బ్రహ్మోత్సవాలు

## నేటి నుంచి నిత్య కల్యాణాలు, ఆర్జిత సేవలు



గోదావరి నదిలో సుదర్శన చక్రానికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 23 : భద్రాద్రి రామాలయంలో వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారికి సుప్రభాతం పలికి.. ఆరాధన, ఆరగింపు, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 4 గంటలకు గోదావరి నుంచి తీర్థపు బిందెను మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చిన తర్వాత స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఆసీనులను చేసి గోదావరి తీరంలోని పునర్వసు మండపం వద్ద 6 గంటలకు వేంచేపు చేసి పంచామృతాలతో స్నపనం జరిపారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, కర్మణః పుణ్యాహవాచనం చేశారు. రోలు, రోకలికి కంకణధారణ చేసి, లక్ష్మి, సరస్వతులను ఆవాహన చేసి పసుపు కొమ్ములు, సుగంధ ద్రవ్యాలు ఉంచి చూర్ణోత్సవం నిర్వహించారు. దీనిని ఉత్సవ పెరుమాళ్లపై ప్రోక్షించారు. ఈ సందర్భంగా స్వామివారి సుదర్శన చక్రానికి గోదావరిలో చక్రస్నానం నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం సార్వభౌమ వాహనంలో స్వామివారికి తిరువీధి సేవ జరిపారు. సాయంత్రం యాగశాలలో పూర్ణాహుతి, వేద విన్నపాలు, అష్టదిక్పాలక బలిహరణం చేపట్టారు. ఆ తర్వాత శేష వాహన సేవ చేసి తర్వాత గరుడ ధ్వజారోహణం చేసి, సంతానం లేని మహిళలకు గరుడ ముద్దలను ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆ తదుపరి అష్టదిక్పాలక ఉద్వాసన, పాలికోద్వాసన, అఖండ దీపారాధన ఉద్వాసన జరిపారు. 12 వాయిద్యాలతో మౌనంగా ద్వాదశ ప్రదక్షిణలు, ఆరాధనలు, నిర్వహించి రాత్రికి శ్రీపుష్పయాగం చేశారు. దీంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కాగా.. రాజ దర్బార్ సేవ, నిత్య కల్యాణాలు, ఆర్జిత సేవలను బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.

# కరకట్ట పనులు జూన్ నాటికి పూర్తికావాలి

## – మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కరకట్ట పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

భద్రాచలం, ఏప్రిల్ 23 : కరకట్ట పనులు జూన్ నాటికి పూర్తి కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుత్తేదారులను ఆదేశించారు. మంగళవారం ఆయన దుమ్ముగూడెంలో పర్యటించిన అనంతరం నేరుగా భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కరకట్ట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యకపోయినా వారి అభివృద్ధి బాధ్యతను మేము తప్పకుండా నెరవేరుస్తామన్నారు. బ్రిడ్జిని శ్రీరామనవమికల్లా ప్రారంభిస్తామని చెప్పి, శ్రీరామ నవమి రోజునే బ్రిడ్జిపై రాకపోకలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ జూన్ నాటికల్లా కరకట్ట నిర్మాణ పనులను పూర్తి చేసి, భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ వరద ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మహబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ పాల్గొన్నారు.

# రేపటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

- మొత్తం పది కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- పదో తరగతికి 955 మంది, ఇంటర్‌కు 1,108 మంది విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 : రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను విద్యాశాఖ పూర్తి చేసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. 5 కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు 955 మంది, 5 కేంద్రాల్లో ఇంటర్ విద్యార్థులు 1,108 మంది పరీక్ష రాయనున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ, రెండు జిల్లాల కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు.

**ఓపెన్ టెన్త్ కేంద్రాలు ఇలా..**

ఖమ్మం నగరంలోని మాంట్‌ఫోర్ట్ హైస్కూల్, ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మామిళ్ళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**ఓపెన్ ఇంటర్ కేంద్రాలు..**

ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్‌ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు.

# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల



మణుగూరులో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

మణుగూరుటౌన్, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన కలెక్టర్ జిల్లా పరిషత్ కో–ఎడ్యుకేషన్ హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎం బాక్సులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యతపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. అనంతరం ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.రాఘవ రెడ్డి, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్సై సతీశ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నామినేషన్

## హాజరుకానున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ, ఎంపీలు వద్దిరాజు, బండి

ఖమ్మం, ఏప్రిల్ 23 : ఖమ్మం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు బుధవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యులు, సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. అనంతరం నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మండల నాయకులు, కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశం జరగనున్నది. ఇందులో హరీశ్‌రావుతోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటనలో తెలిపారు.

# సోలార్‌ప్లాంట్‌ను సందర్శించిన సీఎండీ



సోలార్‌ప్లాంట్‌ను పరిశీలించి మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రామవరం, ఏప్రిల్ 23 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని 10.5 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్‌ను టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కే.వరుణ్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు, ఏరియా జీఎం శాలెంరాజు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం 10.5 మెగావాట్ల సోలార్‌ప్లాంట్ కార్యాలయంలో సోలార్‌ప్లాంట్ విస్తీర్ణం, ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ వివరాలను డైరెక్టర్ సీఎండీకి వివరించారు. సింగరేణిలో మున్ముందు ప్రారంభించబోతున్న 232 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లు, పంప్డ్ స్టోరేజీప్లాంట్, పవన విద్యుత్ ప్లాంట్ తదితర వాటి గురించి సీఎండీకి ఆయన వివరించారు. కార్యక్రమంలో జీఎం సెలార్ జానకీరాం, జీఎం డబ్ల్యూఎస్ అండ్ ఈఎం ఫిజ్రాల్డా, ఏజీఎం దుర్గాప్రసాద్, నర్సిరెడ్డి, ఎస్‌వోటు డైరెక్టర్ కేవీ రావు, ఈఈ బి.శంకర్, అధికారులు పాల్గొన్నారు.